# ఆఫీసరుగారి పిల్లి

తన బల్లమీదికి ఎగిరి దూకిన ఆ జీవిని చూసి రాసుకుంటున్న వాడల్లా ఫైల్ అక్కడ పడేసి భయంగా లేచి నిలుచున్నాడు సెక్షన్ హెడ్.

భయపడటమేగాక ఏదయినా ఆర్డరు వేయండన్నట్లు రెండుచేతులు కట్టుకుని దాని ముందుకు వంగాడు.

అరడుగు ఎత్తు, అడుగు పొడవు శరీరం, జానెడు తోక, చిన్న కళ్ళు, గుండ్రని తల, ముఖాన్నుంచి బయటికి పొడుచుకు వచ్చిన మీసాలు తెల్లని శరీరం మీద ఎర్రని చారలు.

వారు పిల్లి యువరాణివారు. వారు తమ తోకను పైకి క్రిందికీ ఊపుతూ "మ్యావ్" అన్నారు ఓసారి!

"క్షమించండి యువరాణివారూ" అంటూ మరో నమస్కారం పెట్టి "ఒరేయ్ దాసూ ఒక కప్పు పాలు తేరా" అంటూ ప్యూన్‌ను ఆదేశించారు హెడ్డుగారు.

మళ్ళీ "మ్యావ్" అన్నారు పిల్లి యువరాణివారు.

"ఒరేయ్ ఆమ్లేట్ కూడా" అంటూ రెండు రూపాయలు తీసి ప్యూన్‌కు అందించారు హెడ్డుగారు.

ప్యూన్ దాసు బయలుదేరాక యువరాణివారు తోకను మళ్ళీ గర్వముగా ఒకసారి పైకి కిందకి ఊపి సెక్షన్ హెడ్‌వైపు "బి కేర్‌ఫుల్" అన్నట్లు చూసి శరీరాన్ని చాపి నీలిగారు. తర్వాత ఎగిరి సెక్షన్ హెడ్ వెనుకవైపునున్న బీరువా మీదికి దూకారు.

యువరాణీవారు ఎక్కడ తమ మీదికి దూకుతారోనని భయపడ్డ సెక్షన్ హెడ్ పరబ్రహ్మంగారు భయంతో ముఖానికి చేతులు అడ్డంపెట్టుకొని క్రిందికి వంగారు. కాని యువరాణీవారు నేరుగా బీరువా మీదికి దూకి పడిలంగా కూర్చున్నారు అక్కడే.

కొద్దిసేపటికి ప్యూను వచ్చి పొట్లం ఊడదీసి పెట్టాడు. యువరాణీవారు చెంగున దూకి ఆమ్లెట్‌ను శుభ్రంగా తినేశారు. తర్వాత పాలు చల్లార్చి సాసర్‌లో పోయగా చుక్క మిగలకుండా నాకేశారు. తర్వాత హెడ్‌గారు వైపు "వృద్ధిలోకి వస్తావ్ విష్ యు బెస్టాఫ్ లక్" అన్నట్లు సంతృప్తిగా చూసి విశ్రాంతి కొసం మేడ మీదకు వెళ్ళిపోయారు

ఆఫీసరు ఆనందరావుగారిది పెద్ద సంసారం. భార్య గయ్యాళి. పిల్లలు సిసింద్రీలు. ఇంట్లో అతనికి మనశ్శాంతి ఉండేదికాదు. దాంతో ఆయన రాత్రుళ్ళు నిద్రపట్టక పోర్లేవారు. అలాంటి సమయంలో ఒక అర్ధరాత్రి వరండాలోనుంచి దీనాతి దీనంగా పిల్లి ఏడుపు వినిపించింది. తలుపు తీసిన ఆయనకు ఒక పిల్లి చలికి వణుకుతూ ఒకమూల ముడుచుకుని పడుకొని కనిపించింది. జాలిపడి దాన్ని ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని తెల్లవారి ఆఫీసుకు తీసుకుపోయాడాయన.

పిల్లి ఆ రోజు నుంచి ఆఫీసరును క్షణం వదలలేదు. ఎప్పుడూ ఆఫీసరుగారి టేబిల్ పక్క స్టూల్‌మీదనే పడుకునేది. దానికి ఆహారంలో ఏ లోటూ లేదు. ఆనందరావు తన ఆత్మీయురాలిగా దాన్ని చూసుకోసాగాడు. కనుక ఆయన స్టాఫ్‌కూడా అంతే!

క్రమేణా పిల్లి నలుగురిలో తిరగడం నేర్చుకుంది. అయితే స్టాఫ్‌కు మాత్రం పిల్లిమీద విపరీతమయిన అనుమానం. ఆఫీసరుగారు తమ కార్యక్రమాలను సీక్రెట్‌గా తెలుసుకోవడానికే పిల్లిని గూఢచారిగా నియమించారని వాళ్ళ నమ్మకం. అందుకని గుమాస్తా మొదలుకొని సెక్షన్ హెడ్

వరకు దాన్ని ఎంతో గౌరవిస్తారు. అమ్లెట్లు పెట్టి, పాలుపోసి మచ్చిక చేసుకుంటారు. ఆఫీసరు అభిమానించే పిల్లి కాబట్టి తామూ అభిమానిస్తే ఆఫీసరుకు దగ్గర కావచ్చని ఒక ఆలోచన.

ఆరోజు ఆఫీసరుగారి కాన్ఫరెన్సు కాన్ఫరెన్సుకు స్టాఫంతావచ్చి హాల్లో కూర్చున్నారు. పిల్లి టేబులుమీద దర్జాగా కూర్చొని వుంది. ఇంగ్లీషు పిక్చర్లలో పెంపుడు పులిని విలన్ దువ్వినట్లు దాని వీపు నిమురుతున్నారు ఆఫీసరు ఆనందరావుగారు.

ఆఫీసరుగారు ఏదో అడిగారు. వెంటనే జవాబు చెప్పడానికి లేచి నిలుచున్నాడు 'ఎ' సెక్షన్ హెడ్.

పిల్లి అతన్ని చూసి గుర్రుమంది చెవులు రిక్కించి.

ఆఫీసరు పిల్లినొకసారి మార్చి మార్చి చూసి "మిస్టర్ పరబ్రహ్మం! ఆఫీసులో నీ ప్రవర్తన నాకు నచ్చలేదోయ్" అన్నారు.

పరబ్రహ్మం భయపడిపోయాడు. నిన్న తను స్టెనో భుజంచుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కొని సరసాలాడేప్పుడు కిటికీలో ఈ పిల్లి నిలబడి వుంది. దీనికేం తెలుస్తుందిలే! నోరులేనిది ఎవరికి చెప్పుకుంటుంది అనుకున్నాడు. కాని ఇది అయ్యగారికి అంతా చెప్పినట్లుంది!

"సార్ ఈసారికి క్షమించండి ఇక నా నడవడికలో ఏ పొరపాటూ రాకుండా చూసుకుంటాను" ఏడుపు ముఖం పెట్టాడు పరబ్రహ్మం.

స్టెనో తలవంచుకుని కూర్చుంది.

సెక్షన్ హెడ్, స్టెనోల భాగోతం తెలిసి వున్న ఆఫీసుస్టాఫు పిల్లి తెలివికి అమితాశ్చర్యపోయారు.

తరువాత ఎవరెవరు ఏం మాట్లాడుతున్నా మామూలుగానే కూర్చొని

వుంది పిల్లి కాని 'సి' క్రీక్లర్కు నిరంజనం లేచి నిలబడగానే పిల్లి 'మ్యావ్' అంటూ ఉగ్రంగా అరచింది.

ఆఫీసరు పిల్లినొకసారి, నిరంజనాన్నొకసారి మార్చి మార్చి చూసి, "అయితే ఇప్పటికీ ఆఫీసుకు తాగివస్తున్నావన్నమాట" అన్నారు.

పిల్లి వైపు దీనంగా చూసిన నిరంజనం, అఫీసరుగారికి చేతులెత్తి నమస్కరిస్తూ, "సార్ ఈసారికి క్షమించండి. ఇక తప్పుచేస్తే మీరే శిక్ష విధించినా సిద్ధమే" అంటూ ప్రాధేయపడ్డాడు.

తరువాత ఏదో చెప్పేందుకు లేచాడు 'సి' సెక్షను హెడ్. పిల్లి ఒకసారి పులిలా అరిచి ఎగిరిదూకి కిటికీలోంచి పరుగెత్తుకుపోయింది

ఆఫీసరుగారు చిరాకుగా "నాకేం సంజాయిషీలూ అక్కరలేదు. ఈసారి మంత్రి కాన్ఫరెన్సుకు ఎవరిమీదా ఇలాంటి ఆరోపణలు రాకూడదు" అంటూ విసురుగా అక్కడనుంచి లేచిపోయారు.

దీంతో పిల్లి మీద స్టాపుకున్న భక్తి ప్రపత్తులు ఎక్కువయాయి. ఎవరికి వారే పిల్లి దర్శనభాగ్యంకోసం ఉవ్విళూతలూగేవారు ఆమెగారితో తమ సాధక బాధలు చెప్పుకోసాగారు సెక్షన్ హెడ్‌లయితే మరీను. తమ ప్రమోషనుకోసం ఎవరికివారు పిల్లిగారిని ఆమ్లెట్లతో మేపుతున్నారు

• • • •

ఆఫీసరుగారు క్యాంపువెళ్ళి అప్పటికి రెండురోజులయింది. మరి రెండు రోజుల క్రితం వరకు రారు. అయనగారు పోతూ పోతూ పిల్లి గారిని చేతుల్లోకి తీసుకొని కుడిచేత్తో దాని వెన్ను నిమురుతూ యెన్నో జాగ్రత్తలు చెప్పి వెళ్ళారు. సెక్షన్ హెడ్‌ని పిలిచి దానికి ప్రతి రెండు గంటలకు ఒక ఆమ్లెటు, ఒక కప్పు పాలు ఇవ్వవలసిందిగా కోరారు. ఈ

పని కోసం ప్రత్యేకంగా ఆఫీసు అటెండరలతో ఒకడయిన దాసుని నియ
మించారు.

దాసు కొద్దిగా ఖర్చుమనిషి సెక్షన్ హెడ్ చెప్పిన ఆమ్లెట్లలో కాస్త కమీషను కొట్టి మిగిలిందే పిల్లికి పెడుతున్నాడు. అయితే ఆఫీసరు చేసిన ఏర్పాటేగాక స్టాఫుకూడా పోటీలమీద తరచుగా పిల్లిని మేపుతూ మర్యాద చేస్తున్నందువల్ల దానికేం బాధలేదు.

ఆ మధ్యాహ్నం మేడమీద రికార్డు రూములో కొద్దిసేపు నిద్ర పోయిన పిల్లిగారు తిరిగి క్రిందికి వచ్చారు. క్రిందికి వచ్చి 'సి' క్లర్కు నిరంజనం టేబులు డ్రాయరుతీసి వుంటే దాంట్లోకి దూరి మూత్రవిసర్జన చేసి బయటికి వచ్చారు. వారు బయటకు వచ్చేంతవరకు చేతులు కట్టుకొని వున్న నిరంజనం మరుక్షణం టేబులు శుభ్రం చేసుకొన్నాడు.

పిల్లి గారు అఫీసులో అందర్నీ పలుకరించి యోగక్షేమాలు విచారించి బయటికి వెళ్ళిపోయారు. ఆ పోవడం, పోవడం మరలా ఎవరికీ కనిపించలేదు. మూడోరోజు ఆఫీసరుగారు క్యాంపునించి వచ్చి పిల్లిగారి కోసం విచారిస్తే ఎవరూ జవాబు చెప్పలేకపోయారు. కోపంతో మండి పోయిన ఆఫీసరు అందరినీ చెడామడా తిట్టేసాడు ఇద్దరు అటెండర్లకు చార్జి మెమోలు, ఇద్దరు గుమస్తాలకు ఇంక్రిమెంట్లు కట్ చేసేంతవరకు ఊరుకోలేదు సెక్షన్‌హెడ్‌లను పిలిచి ఫైళ్ళమీద సాకు పెట్టి నానారకాలుగా తిట్టారు.

ఆ రోజే సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటలకు పిల్లిగారు మరో పిల్లి గారితో కలసి కొత్త పెళ్ళికూతురిలా కుడికాలు ముందుపెట్టి నెమ్మదిగా లోపలికి వేంచేశారు.

పిల్లిగారు తన ప్రియుడు పిల్లిగారితో వచ్చినపుడుగాని ఆఫీసరుకు

అర్థంకాలేదు. ఎన్ని వున్నా తన జాతి ప్రాణి ఇంకొకటి వుంటేనేగాని ఏ ప్రాణికీ రోజులు గడువవు. అందుకే ఇప్పుడు ఆఫీసరుకు పిల్లి కితోడు ఇంకో పిల్లి వుండాల్సిన ఆవశ్యకత అర్థమయ్యింది. దాంతో పిల్లికి అలాట్ చేసిన ఫండ్సు డబుల్ చేసాడు.

అప్పుడు ఆఫీసుస్టాఫుకు రెండు పిల్లులకూ మర్యాద చేయాలంటే తల ప్రాణం తోకకొచ్చినట్లుగా వుంది. అయినా తప్పదు అది అయ్యగారి పిల్లి. ఆ పిల్లిగారి ప్రియుడు వీరు. ఎలా కాదనగలరు. మనసులో ఎన్ని తిట్టుకొన్నా, పైకి నవ్వు ముఖాలు తగిలించుకొంటున్నారు.

ఆఫీసరు గారికి కూడా కొద్దిగా బాధగానే వుంది. ఎప్పట్లా పిల్లి తనచుట్టూ మ్యావ్, మ్యావ్మని తిరగడంలేదు. సరిగదా కొత్తగా వచ్చిన పిల్లి చుట్టూ మ్యావ్, మ్యావ్మంటూ తిరుగుతూ దాని వీపు, తోక నాకుతూ వుంది. అది కూడా ఈ పిల్లి చుట్టూ తిరుగుతూ దీని మూతి నాకుతూ వుంది. అయితే అది తనచుట్టూ తిరగకపోయినా హాయిగా తన టేబులు ప్రక్కనే రెండూ కలసి పోట్లాడుకొంటూ, కాట్లాడుకొంటూ ఒకదాన్నొకటి తరుముకొంటూ ఆడుకోవడం అతనికెంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

రోజులు గడిచిపోతున్న కొద్దీ పిల్లి గారు మరింత బలిసిపోతున్నారు. నడవడంలో కూడా స్టైయిల్గా మెయిన్టెయిన్ చేయసాగారు. అందరూ ఇది కొత్తపిల్లి వచ్చిన మహాత్మ్యం అనుకొన్నారుగాని, అయ్యగారి పిల్లి కడుపు తెచ్చుకొని నడవలేక నడుస్తూ దాన్ని స్టైయిలుగా కప్పి పుచ్చుతోందని తెలుసుకోలేకపోయారు.

ఒకరోజు కొత్తపిల్లి ప్రతి సీటుదగ్గరికి వచ్చి 'మ్యావ్,' 'మ్యావ్' మంటూ అరవసాగింది పిచ్చిపట్టినట్లు. తరువాత ఆఫీసరుగారి చుట్టూ

తిరుగుతూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆఫీసుకురాగానే తన కాళ్ళచుట్టూ స్వాగతం చెప్పే తన పిల్లి రానందుకు అసలే చికాకుగా ఉన్న ఆఫీసరు కొత్తపిల్లిని చూసి అనుమానించాడు.

"అది ఎక్కడుందో చెప్పు! దొంగ రాస్కెల్" అంటూ మండి పడి అరిచాడు.

కొత్తపిల్లి దీనంగా చూస్తూ ముందుకు నడచి వెనక్కు తిరిగి చూసిందిరమ్మన్నట్లు. తరువాత కాళ్ళదగ్గరకు వచ్చి పాదాలు నాకి మరలా బయలుదేరి నాలుగుగజాలు నడచి వెనక్కు తిరిగిచూసి మ్యావ్ అంది. పిల్లి తనవెక్కడికో పిలుస్తూందని అప్పుడు అర్థమయింది ఆయనకు. సీట్లోంచిలేచి దాని వెనుకనే బయలుదేరారు. పిల్లిగారు అలా ముందు నడుస్తోంటే వెనుకనే ఆఫీసర్‌గారు నడవసాగారు. ఆఫీసరు అలా నడుస్తోంటే సెక్షన్‌లో వున్న వారంతా లేచి నిలబడి ఆఫీసరు వెనుకనే నడవసాగారు. అలా కొత్తపిల్లి ఆఫీసంతా తిప్పి చివరకు రికార్డు రూములోకి దారితీసింది. రికార్డురూములో ఓ మారుమూల రికార్డును కింద తోసుకొని పడుకొని ఉంది అయ్యగారి పిల్లి. ఇప్పుడు బలహీనంగా బక్కచిక్కి వుంది. అందర్నీ గుర్రుమన్నట్లు చూసింది. ఆమెగారు అప్పటికే బంగారంలాంటి ఆరుపిల్లల్ని పెట్టింది. కొత్తపిల్లి ఇదిచూసి ఎగిరిగంతేసి అయ్యగారి పిల్లి మూతిని అప్యాయంగా నాకసాగింది.

అప్పటికి అర్థమయింది అందరికీ— అయ్యగారిపిల్లి ప్రసవవేదన పడుతూంటే చూడలేని ఆమె భర్తగారు ఆఫీసరుగారికి ఈ విషయం చెప్ప డానికి వచ్చారని. ఆఫీసరుగారు ఆనందంగా పిల్లిగారి నిమిరి ఆశీర్వదించి, తన సీట్లోకి వచ్చి కూర్చున్నారు. ఆయన ఒకవేపు ఆఫీసుపని చేస్తూనే తన పుత్రికా సమానమైన పిల్లిగారిని మనవళ్ళు, మనవరాండ్రు అయిన

సదరు పిల్లిపిల్లల భవిష్యత్తు గురించి ఇప్పుడే బృహత్తర ప్రణాళికలు వేస్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. తొమ్మిదవరోజు రాగానే ఆఫీసరుగారు, అఫీసుస్టాఫు సహాయ సహకారాలలో పుట్టిన పిల్లలకు బారసాల ఘనంగా చేసారు. ఆ సాయంత్రం రిసెప్షన్‌లో టేబులుమీద పరచిన కొత్తటేబులు క్లాత్‌పై భార్యాభర్తలయిన పిల్లులుంగార్లు కూర్చున్నారు. వారి పిల్లలు కూడా అదే టేబులుమీద తల్లిదండ్రుల మాటలు జవదాటని బుద్ధిమంతుల్లా కూర్చున్నారు ఇంతకుముందులా ఒకరి తోకను మరొకరు కొరుక్కోవడము, ఒకరి బొచ్చును మరొకరు పీక్కోవడం లాంటివేం లేవు. గిల్లి కజ్జాలుమాని బుద్ధిగా కూర్చున్నారు పిల్లిపిల్లల మెడల్లో "ఎ" నుంచి "ఎఫ్" వరకు అక్షరాలతో కూడిన బిళ్ళల చెయిన్‌లున్నాయి. వాటి అర్థం ఆఫీసరుకు తప్ప మరెవరికీ తెలియదు.

రిసెప్షను అనంతరం ఆఫీసరుగారు ఆఫీసు క్రమశిక్షణ గురించి సుదీర్ఘమైన ఉపన్యాసమిచ్చారు. తరువాత– "ఈ చిన్నారి పిల్లుల మెడల్లో కట్టిన బిళ్ళల అర్థం మీకు తెలుసనుకొంటాను. ఇక్కడ వున్న పిల్లుల్లో "ఎ" అన్నది "ఎ" సెక్షనుకు సంబంధించిన పిల్లి. అంటే దానిపోషణ బాధ్యత "ఎ" సెక్షను హెడ్‌ది అతని స్టాఫుది అన్నమాట: మిగతావి కూడా ఏ బిళ్ళ ఉన్నది ఆ సెక్షన్‌కు సంబంధించినది. ఏ సెక్షనునుంచీ కంప్లయింటు రాకూడదు. పెద్దపిల్లుల బాధ్యత నేనే తీసుకుంటున్నాను" అన్నారు.

ఆఫీసరుగార్ని ఎవరు ఎదిరించి మాట్లాడగలరు? అందరూకుక్కిన పేనులు అయిపోయారు. ఆఫీసరు ఆర్డరంటే అంతే! రోజులు గడిచి పోతున్నాయి. స్టాఫుకు ఆఫీసు ఫైళ్ళుచూసేకంటే పిల్లుల తగవులు తీర్చ

దము కష్టమైపోతూ ఉంది. ఇంతకుపూర్వం రోజూ అయిదుగంటలకు కొంపలకు పోయేవాళ్ళకు ఇప్పుడు రాత్రి ఏడో ఎనిమిదో అవుతుంది.

మూడునెలలు గడిచాయి. ఆరోజు ఆఫీసరుగారు రిటైరయ్యేరోజు. ఆయన ముఖం విషాదంగా ఉంది. ఆఫీసుస్టాఫు ఆనందంగా వున్నారు. ఆఫీసరు దిగులుకు అర్థం తెలియని పిల్లికుటుంబం దిక్కులేని పిల్లలా కాళ్ళకు అడ్డాలు వస్తూంటే కనబడి కనబడకుండా విసుక్కొంటున్నారు ఆఫీసుస్టాఫు.

ఆఫీసరుగారు రిటైరయిన సందర్భంగా బ్రహ్మాండమైన వీడ్కోలు పార్టీ ఇచ్చారు తను రిటైరయిన దానికంటే పిల్లికుటుంబాన్ని వదలిపోతున్నందుకు చాలా బాధపడ్డారాయన. కళ్ళనీళ్ళతో వీడ్కోలు తీసుకొని జీపులో ఇంటికి వెళ్ళిపోయారు.

ఆ రోజునుంచే పిల్లికుటుంబానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆ మరుసటి రోజు ఎంతో ఆప్యాయంగా తమవద్దకు వచ్చిన పిల్లుల్ని కర్రలతోనూ, బెల్టులు తీసుకునీ తరుముతున్నారు ఆఫీసు సిబ్బంది. అవి మూల మూలకు పరుగెడుతోంటే తిరిగి తిరిగి వాటిని బయటికి తరిమారు.

కొత్తఅఫీసరుకు పిల్లులంటే అసహ్యం. అందుకే వాటిని రోడ్డు మీదికి తరిమికొట్టించి లోపలివేపు ప్రహరీచుట్టూ అటెండర్లను కాపలా ఉంచాడు. గేటుమూసినా గోడమీదనుంచి పిల్లులు ఎక్కిరాకుండా అటెండర్లు కర్రలు తీసుకొని పహరా కాయసాగారు.

*